# సంకుదేముడు

కోయగూడెం అంతా అట్టుడికినట్లు ఉడకిపోతూంది. ఏమిటో సంబరం? ఈ అడివి జంతువుల మధ్య ఎలా బ్రతకడం? చెబితే మట్టుకు వినిపించుకునేదెవరూ? అంటూ మంగతాయారమ్మ అప్పుడే తలంటుకుని ముఖాన పసుపురాచుకుని పాతబడ్డ, కాణీ బిళ్లంత కుంకుమబొట్టుతో అలంకరించిన గౌరమ్మలా వచ్చి పరంధామయ్యను ప్రశ్నిస్తున్నట్లు చూస్తూ నిలబడింది.

ఆ గూడేనికి కొత్తగా ఉద్యోగ రీత్యా వచ్చిన పరంధామయ్యకూ కారణం ఏమీ తోచలేదు. ఏదైన పండగ సందర్భమా? అంటే అదీ కాదు! అదీ చైత్రమాసమే ఐనా సంవత్సరాది ఏ సడీ చప్పుడూ లేకుండా చల్లగా జారుకుంది. ఇక శ్రీరామనవమి సంగతి ఆ రాముడికే తెలియాలి. ఆ విషయం తమ దంపతులకు దప్ప మరో జీవికి తెలిసినట్లే లేదు. మరి ? ఉన్నట్లుండ ఇప్పుడీ గూడెంలో పొంగిపొరలుతున్న ఈ అలజడి ఎందుకో? అర్థం కాక అటూ ఇటూ పచార్లు చేస్తున్న పరంధామయ్య ఆలోచనకు భంగం కలిగిస్తూ

'పంతులా! నీవూ, నీది పెండ్లం మాది 'సంకుదేముడు' పండుగ సూసేనికె రా' అంటూ ఆ గూడెం బరికాడు పిలిచాడు. దాంతో పరంధామయ్యగారికి ఆనాడు 'సంకుదేముడి' పండగ అనే విషయం తెలిసి వచ్చింది. కానీ తాయారమ్మకు మాత్రం అరికాలికి అంట్లు తగిలినంత చీదర ముంచుకురాగా ' ఈ బోడి సంబడం చూట్టానికి అనాకారి మిమ్మల్ని ఆహ్వానిస్తూ వచ్చాడన్న మాట' అంటూంటే విన్న 'బరికాడు' సంతోషంతో ముఖం చేటంత చేసుకుని

'పంతులా! నీదిపెండ్లం ఖరా చెప్పింది. మాది సండిగెకు 'నూకదొర' కులం పెద్ద పెద్దన్న దొర, ఇంగ కొండ దొర, కులం పెద్ద 'బోడిధొర' వస్తుండది. పూజారి 'భిక్క' గూడెం పెద్ద 'నాయుడూ' దొర వస్తుండది. మీకే కూడా రావల్సింది' అంటూ వెళ్లిపోయాడు.

పరంధామయ్యగారికి భార్య ముఖం చూచే ధైర్యం లేక పక్కనే అందుబాటుగా ఉన్న తుండుగుడ్డ భుజానేసుకుని 'రవీంద్ర'ను వెదుకుతూ వెళ్లాడు.

ఆడబోయిన తీర్థం ఎదురైనంత పనిగా వెదుకబోయిన 'రవీంద్ర' ఎదురై బాబాయిగారూ? మీరెక్కడికి? అంటూ పరంధామయ్యగార్ని పలుకరించాడు.

'ఆఁ ఏమీలేదోయ్! ఈ 'సంకుదేముడి' సంబరం ఏమిటో తెలుసుకుందామనీ నీ దగ్గరికే వస్తూవుంటే 'వెదుకబోయిన తీగె కాలికి తగిలినట్లు' నీవే ఎదురుపడ్డావ్. ఇక సంబరాల కవిలెకట్టంతా విప్పి కుప్పలు పెదతావ్ వినడానికి వోపికను మాత్రం నేను చిక్కబట్టుకోవాలి. అవునా నాయనా!'

అంతే బాబాయ్! రెండేళ్లనాడు 'మగనాలి' సుంకం చెల్లించి 'సుక్రిని' పెళ్లిచేసుకున్న తరువాత మా ఆచారాలంటే నాకు మమకారం పెరిగింది. నేనూ కొండజాతి వాడినే! నా పేరు చిత్రడు. అదృష్టం కలిసి రావడంతో నాకు చదువుకునే అవకాశం దొరికింది, నా వేషం, భాషా అంతా మారింది.

దీనికంతటికి కారణం కొండజాతివారి సంక్షేమానికి గవర్నమెంటు వారు తీసుకుంటున్న శ్రద్ధ అనే చెప్పాలి.

'ఇందులో చెప్పేదేముంది? అందుకేగా వూరూ, వాడా విడిచి ఇక్కడొచ్చి నే చిక్కింది'.

అయితే ఇదేమిటోయ్ ? ఈ గూడెం అంతా విచిత్రాల పుట్టలా వుంది. ఇంతకూ నీవేమీ అనుకోకపోతే ఇందాకా నీ పెళ్లిని గూర్చి ఏదో చెప్పావే, అది వినాలని వుంది. 'మగనాలిసుంకం' అంటే వరకట్నంలాంటిదా? కాకపోతే ' ఓలి' లాంటిదా. అదేనయ్యా ! మా భాషలో కన్యాశుల్కం. అదే అయి వుంటుంది.

'బాబాయ్! ఈ రెండూ కావు. మారు మనుంపోయే ఆడపిల్ల మొదటి మొగుడు పంచాయతీ తెచ్చినప్పుడు కులపెద్దలు వాడికిచ్చే రొక్కాన్ని నిర్ణయిస్తారు. దాన్నే 'మగనాలిసుంకం' అంటారు. ఆ తీర్పును 'మగనాలి తీర్పు' అంటారు. ఈ రొక్కానికి తోడు కులపెద్దలకు కోడీ, గొర్రెఘూంసాల పొలావువిందూ, కల్లూ, సారాలు ఏర్పాటు చేయాల్సి వుంటుంది. ఆ ఏర్పాటును ఖాతరు చేయకపోతే ఆ పాతమొగుడు అడిగినంత రొక్కం గుమ్మరించాల్సి వుంటుంది. ఈ చిల్లెర దేవుళ్లను మచ్చిక చేసుకుంటే రొక్కం పెద్ద మొత్తం కాకుండా సర్దుబాటు జరుగుతుంది. ఈ కులపెద్దలు నిర్ణయించే రొక్కం ఈ తగువు సుంకం!'

అయితే బాబూ రవీంద్రా! నీకు 'మగనాలి సుంకం' తీర్చే అవసరం ఎందు కొచ్చిందోయ్? ఎవరైనా కాళ్లుకడిగి, కళ్లకద్దుకుని పిల్లనిద్దురుగా?

ఇచ్చేవాళ్లే! కానీ బాబాయ్! సుక్రి నా చిన్నప్పటి నేస్తం. నా మనస్సుకు నచ్చింది నన్ను మెచ్చిందీ! మెళ్లో 'వెదురపుసంగి' చెవులకు 'నాగులూ' 'రసకమ్ములూ' పెట్టుకుని కాళ్లకు కడియాలు, కాలివేళ్లకు 'కల్మువంగీలు' పెట్టుకుని 'గంగదేముడూ', నందిదేముడూ లాంటి పెద్ద పండగలకే కాదు, సామకొత్త, 'మామిడి కొత్త' 'కందికొత్త' 'గుమ్మడికొత్త' దేవర కొల్పులప్పుడు కూడా అది 'ధింసా' తొక్కిందంటే ? కోడేపాయాన ఉన్న ప్రతి మగవాడి గుండెలు తప్పెటమోతగా ఎగిసి పడేవి, అంటే నమ్మండి. అయితే దాని మనసు మాత్రం నాకే ముడుపుకట్టింది.

'బందపున్నమ' అంటే శ్రావణపౌర్ణమి అదే ఇప్పటి రాఖీపౌర్ణమినాడు మా కొండజాతి వాళ్లంతా అదమరిచి కొండల్లో, కోనల్లో తిరిగే తమను క్రూరమృగాలేవీ బాధించకుండా కాపాడేందుకు 'జకణ' దేవుణ్ణి కొలుస్తారు. ఈ దేముడు ఒక ఇనుపముక్క రూపంలో ఉంటాడు. ఈ దేముణ్ణి ఒక కుండలో పెట్టి మరో కుండ మూస్తారు. ఈ రెంటినీ వో మామిడిచెట్టు కింద చదరపు బండపై ఉంచి పూజలు చేస్తారు. ధూపదీపాలతో అడివిపందిని బలి ఇస్తారు. తరువాత సంవత్సరం పొడుగునా ఏ ఆపదలూ రాకుండా గుమ్మడి ఆకులు తింటారు.

నేను సెలవల్లో వచ్చినప్పుడల్లా పాపం నాకు ఈ గుమ్మడి ఆకులు పూజనాటివి దాచి దొంగచాటుగా తెచ్చి తినిపించేది. కాని అనుకోకుండా నాకు జబ్బుచేసి పట్నంలోనే ఉండిపోయాను. అప్పుడు మా గూడెం నాయకుడి కొడుకు సుక్రిని దక్కించుకుందామని ప్రయత్నించీ, దాంతో చెంపదెబ్బలు తినీ, పంతంతో, మా కులపు పురోహితుణ్ణి మనుమడుగ పంపాడు. వచ్చిన దాసరి మాటలు కాదనలేక సుక్రీకి, పండన్నకు పెళ్లయింది. బాగా బతికి చెడ్డ సుక్రి తండ్రి తాగుడుకు అలవాటుపడ్డ పాపానికి బిడ్డను ' ఆవు' ను అమ్మినట్లు 25 రూపాయల 'వోలీ' తీసుకుని పండన్నకు మనుముడిగా ఇచ్చాడు.

అయితే 'సుక్రి' నీ వెంటలేచి వచ్చిందన్న మాట. చదువుకున్నవాడివి ఇదేమన్నా న్యాయంగా వుందా? పరాయిస్త్రీని ఆశించావా?'

'పరంధామయ్యగారూ! మీరేమన్నా నాకేం బాధలేదు. మాకులంలో మూడు రకాల పెళ్లిళ్లు చెల్లుబడిలో వున్నాయ్. ఇంటి పెద్దలు 'దాసరి'ని మధ్యవర్తిగా పెట్టి నిశ్చయించే పెళ్లి. ఈ పెళ్లికూడా పిల్ల ఇష్టానికి వ్యతిరేకంగా జరగదు. రెండవది 'ఎత్తుకట్ల' పెండ్లి ఇది వధూవరుల పెద్దల ప్రమేయం లేకుండా జరుగుతుంది. ఇద్దరూ కలిసి ఒక రాత్రి వెళ్లిపోయి మరునాడు విందుతో పెద్దలందరి ఆశీర్వాదం పొందే పెండ్లి, మూడవది ఇల్లరికపు పెండ్లి. ఓలీ ఇవ్వలేని వరుడు ఇల్లరికానికి అంగీకరిస్తాడు.

రవీంద్రా! మరి అలాంటప్పుడు నీ నేస్తం పండన్నతో పెళ్లికి ఎట్లా వొప్పు కుందంటావ్? నాకీ పెళ్లి వద్దనవచ్చుగా? డబ్బుకు ఆశపడి వుంటుంది!.

'అలాకాదు బాబాయ్' 'సుక్రి' తండ్రి తాగుబోతుగా మారాడు, తల్లిలేదు. ఈడేరిన సుక్రి పనిపాటలకంటూ వస్తూపోతూ వుంటే మగజాతి కళ్లను కాదనేదెవరూ? నమ్ముకున్న నా జాడ తెలిసిరాలేదు. ఎదుటివాడు తనను కోరి రాజమార్గంగా పెద్ద 'వోలి' ఇచ్చే నాయకుని కొడుకాయె. అందుకే 'సుక్రి'నెత్తీ నోరూ కొట్టుకుని చివరకు చేసేదిలేక ఊరుకుంది. అయినా వినండి జరిగిన విచిత్రం!

మా కొండ దొరల ఇళ్లల్లో పెండ్లికొడుకు ఇంట్లోనే పెండ్లి జరుగుతుంది. సాధారణంగా సంక్రాంతి నెల నిల్చిన తరువాత, వో మంచి రోజు అంటూ దాసరి చెప్పిననాడు పందిరివేసి 'అరటి' 'మామిడి' కొమ్మలు మధ్యలో పాతుతారు. ఆ తరువాత కులపెద్దలూ, కొందరు బంధువులూ కలిసి 'మడ్డికల్లు' కావడి, వో 'పందీ' అయిదుమాన్కల బియ్యం రంగురంగు అద్దాల గాజులున్న వెదురుబొంగు పెట్టె, పూసల పేర్లూ తీసుకుని పిల్ల ఇంటికి పోతారు. అక్కడ వీళ్లందరికీ మాంసపు భోజనం విందుగా దొరుకుతుంది. తినీ తాగిన తరువాత ఆడా-మగా కలిసి 'ధింసా' నృత్యం చేస్తారు. దీని తరువాత పెళ్లి పిల్లతో కలిసి పిల్లవాడి ఇంటికి వెళ్తారు.

ఆ ఇంట్లో వధూవరులిద్దరూ 'రవి' దిక్కు ముఖం చేస్తూ పందిరి మధ్య అలికి ముగ్గు పెట్టిన చోట కూర్చుంటారు. వీరిద్దరి పక్కపక్కన వయసు మళ్లిన ఆలుమగలు అంటే 'మిథాయి బుడ్డీ మిథాయి బుడ్డాలు కూర్చుంటారు. అప్పుడీ రెండు జంటలు, దాసరి మంత్రాలు చెప్పగా పసుపు పూస్తూ దొరికిన ధాన్యాన్ని వధూవరుల తలలపై గుమ్మరిస్తారు. 'దాసరి' వెంటనే పెట్టెలో ఉన్న అలంకారాలను పిల్లకు తొడుగుతాడు. ఆ తరువాతి రాత్రి పరిచి ఉంచిన 'చాప' మీదికి భార్యాభర్తలిద్దరూ చేర్తారు.

ఆ రాత్రి అనుకోకండా పండన్న భార్య పక్కకు చేరగానే ముచ్చెమటలు పోస్తూ చల్లబడ్డాడు. తెలిసీ తెలియని భయంతో సుక్రి రాత్రంతా జాగారం చేసింది. ఇదివిన్న తండ్రీ, చుట్టాలందరూ 'సుక్క సొంటి సుక్రి దొరికిందనే ఖుసీల మడ్డికల్లు మోతాదుదాటి పట్టిస్తే అసలు సుక్కను మర్చి సోలిపోయిండు, ఇప్పుడేం తొందర? అనుకున్నరు. గండం తప్పినందుకు 'సుక్రి' 'జెకర' దేముడికి మొక్కుకుంది. కానీ తెల్లవారి అసలు గండం ఉంది.

ఆనాడు పండన్న మాంచి హుషారుగా పెద్ద గొర్రెపోతును తెప్పించి విందు చేశాడు. నిన్నటి భయంతో తగు మాత్రంగా పుచ్చుకున్నాడు. 'ధింసా' నృత్యంలో కన్నెపిల్లల అడుగులకు 'లయ'ను కల్పించే 'పిరోడి' అంటే ఇత్తడితో చేసిన మురళిని ఒక్కసారి మ్రోయించాడు అంతే! సుక్రి మొదలు నరికిన చెట్టులా కూలిపోయింది. అందరూ తలోమాటా అనుకున్నారు. పెళ్లికి తరలి పోతూ ఉంటే 'కుందేలూ' కొండగొర్రె అడుపులు వినిపించాయి. అప్పుడే అనుకున్నాం ఈ పెళ్లి అవలక్షణపు పెళ్లి అవుతుందనీ కొందరంటే, ముసలి వాళ్లు అయ్యో! ఇదంతా కోరికలు తీరకుండా చచ్చిన 'పెరిబీబి' అంటే పెద్ద ఆడుబిడ్డ మాయ అన్నారు. అనాటి నుంచి వోవారం వరకూ 'పెరీబీబీ'ని ఖుషీ చేసే తంతే జరిగింది. అందుకే పెళ్లయి

పది దినాలు దాటినా పండన్నకు ' ఇల్లుకెర్నిసెనికా' జరగనే లేదు, అంటే వాళ్లింకా శారీరకంగా ఆలుమగలు కానేలేదు.

చల్లారని వేడితో పండన్న విల్లంబులు పట్టి రోజూ ఓ వేటతెస్తూనే ఉన్నాడు. ఇంట్లో పండుగ భోజనం తింటూనే ఉన్నారు. పద్నాల్గు రోజులు గడిచినాయి. తెల్లవారితే ఆచార ప్రకారం పిల్లా, పిల్లవాడు బంధువర్గంతో కలిసి రెండు కుండల మడ్డి కల్లూ, మూడుకుంచాల బియ్యం తీసుకుని పిల్ల ఇంటికి వెళ్లాలి. చోటు మారిస్తే 'పెరీబీబి' పీడ విరగడౌతుందని అంతా సంబరంగా పయనం సాగించారు సుక్రి ఇంటికి.

పెద్ద ఇంటికోడలుగా తన బిడ్డ బియ్యం కల్లూ వేటతీసుకుని తన ఇంటికి వారపు నిద్దర్లకని వచ్చినందుకు తండ్రి ఎంతో పొంగిపోయాడు. అందరాని జుంటి తేనే జుర్రుకుంటున్న ఆనందంతో పండయ్య మీసం మెలేస్తూ అలికిన గుడిసెలో కూర్చున్నాడు. సుక్రి తలంటుకుని తెల్ల చీరకట్టి అద్దాల గాజులు తొడిగి నిబ్బరంగా మసలుతూంది. జకరదేవుణ్ణి తల్చుకుంది తనకన్నొరికం కాపాడ్తే పున్నమనాడు ఉపవాసం ఉండి 'భువనం' పెట్టి ధింసా నృత్యం చేస్తానంది. చీకట్లు పడ్డాయి తమకోసం ఏర్పాటైన వెదరు చాపమీదికి వచ్చి పండయ్య పడుకున్నాడు భార్యకోసం ఎదురుచూస్తూ. ఇంతలోకే తడికతోసుకుంటూ 'సుక్రి' వచ్చి వొదిగి వోరగా పడుకుంది.

'దగ్గరుకురావే చుక్కా' అంటూ పండయ్య సుక్రిని వద్దకు తీసుకోబోయాడు. అంతే! నిలువెత్తు పండన్నకు ముచ్చెమటలు ముంచుకొచ్చాయి. తనెందుకో తన మగతనంపైన నమ్మకం కుదురలేదు. కాళ్లూ చేతులూ విపరీతంగా లాగుతున్నాయి. విపరీతమైన బాధతో పండన్న గిలగిలలాడిపోయాడు. విషయాన్ని విన్న గూడెమంతా గుసగుసలు పోతూ పండన్న మగవాడే కాడన్నారు. సుక్రి ఇలవేల్పులందరికీ మనుసులో దండాలు పెట్టుకుంది. ఈ మాటవిన్న పండన్న తండ్రి నిప్పు తొక్కిన కోతిలా లేచాడు.

'నిజానికి పండన్నలో ఏ లోపమూ లేదు. నూటికి నూరు పాళ్ళూ మగవాడే. అయితే యిదంతా మయలాడి సుక్రి పని. దీన్ని ఎగేస్కుపోయి పట్నంల పేరు లేకుండ సచ్చిన చిత్రడు దెయ్యం అయి చేస్తున్న పని' అంటూ తలో మాట అన్నారు. వోలి రొక్కం 25 రూపాయలు తాగుబోతు తండ్రికిచ్చినవి తెమ్మంటూ పిల్లవాడి తండ్రి బలవంత పెట్టాడు. కులపెద్దలూ ఇదే తీర్పు ఇచ్చారు. తండ్రి బలహీనుడు కావడం వల్ల 'కొండపోడు' వ్యవసాయం చేయలేదు. అందుకే పాపం సంవత్సరం పాటు అడివికెళ్లి 'అడ్డాకులూ', 'మూలికలూ' తెస్తూ అంగట్లో అమ్మి 'సామజావతో' పొట్టపోసుకుంటూ తీసుకున్న వోలిపైకం చెల్లించింది సుక్రి. చిక్కి ఎముకల గూడులా మారింది.

దీన్ని తాకితే చిత్రడు బతుకనివ్వడనే భయం సుక్రి శీలానికి రక్షగా ఉంటూ వచ్చింది.

ఆనాడు 'సంకుదేముని' పండగ. అంటే తొలకరికి మునుపు చైత్రంలో విత్తనాల శుద్ధి పండగ. వ్యవసాయపు ప్రారంభానికి పూర్వం ఆటవిడుపుగా మా మగవాళ్లంతా విల్లంబులతో అడవులకు వేటకోసం పోతారు. ఆడవాళ్లంతా గుంపులుగా చేరి ఎక్కువ వేటతో వచ్చిన వారిని సన్మానిస్తూ, తేలేని వాడిని ఎందకూ పనికిరాని వాడిగా ఈసడిస్తూ పేడనీళ్లు చల్లుతూ వినోదిస్తారు. మద్యమాంసాలకు కొదువ వుండదు. ధింసా నృత్యం తప్పనిసరి. దీని తరువాత 'సంకుదేముని' పండుగ. అంటే పనికి శుభప్రారంభంగా శ్రీకారం చుడ్తారు.

చైత్రమాసంలో ఒక ఆదివారం కానీ, సోమవారం కానీ ఊరికి పడమరగా చెట్టుకింద 'పిరమిడ్' అకారంలో ఉన్న రాయిని ఈ దేవునికి సంకేతంగా నిల్పుతారు. గూడెం వారంతా ఇచ్చిన బియ్యం వండి ఆ అన్నాన్ని పూజారి, దేముని ఎదుట రాశిగా పోస్తాడు. దాన్నే భువనం అంటే 'భోనం' అంటారు. ఈ బోనంలోనే చోళ్లు సామలు, కొర్రలూ, జనుపగింజలు కలిపి పోస్తారు. పూజారి ఊదుపొగవేస్తే మరో కొండరైతు పందిని బలి ఇస్తాడు. తరువాత ధాన్యం కలిపిన ఈ బోనాన్ని పైకీ, దిక్కులకు వెదజల్లుతారు. ఇట్లా చల్లిన ప్రసాదాన్ని బుట్టలల్లో పట్టి విత్తనపు గింజలతో కలిపి నారుగా విత్తితే దేముడు అధిక దిగుబడి ఇస్తాడు. చీడపీడలుండవూ అనే నమ్మకం ఉంది.

సరిగ్గా ఈ బోనం చల్లే సమయానికి నేను పట్నం నించి ఇక్కడికి వచ్చాను. అందరూ భయంగా ఆశ్చర్యంగా చూశారు. సుక్రి వచ్చి నన్ను చుట్టుకుంది. నా చేతుల్లో వోదార్పు పొందింది. ఆనాడు సుక్రి తొక్కిన 'ధింసా' మరపురాని తాండవం.

తెల్లవారింది. పండన్న పది మందతో కలిసి 'మగనాలి తగువు' తెచ్చాడు చెల్లించాల్సిన రొక్కం అయిదు వందలు. ఇది ఎవ్వరూ కనీ, వినీ ఎరుగని రొక్కం. ఇది విన్న సుక్రి ముఖం వాలిపోయింది. ఇంత సొమ్ము నేనివ్వలేనని భయంతో వణికిపోతుంది. సుక్రి తండ్రికి నిషాదిగినట్టయింది. కులపెద్దలకు మాట పెకలలేదు. మళ్లా పెళ్లి చేసుకుని వోబిడ్డ తండ్రి ఐన పండన్న, నేను బ్రతికి ఉన్నాను దయ్యం కాలేదన్న ధైర్యంతో నా పెళ్లాం నాకు కావాలి అన్నాడు. ఏ విందుకు ఆసపడకుండానే కులపెద్దలు 'మూడువందలు' అన్నారు.

అది కూడా మోయలేని బరువే అనుకున్నారు. కానీ నేను సంతోషంగా ఒప్పుకున్నాను. నలుగురు పొగిడే విందు చేశాను. పండన్న కడుపునిండా తాగి 'చిత్రా! సుక్రి నా 'దిరిబుడ్డి' అంటే చెల్లులు తీస్కపోరా అంటూ సుక్రి చేతిని నా చేతికిచ్చాడు. ఇదీ నా కథ.

ఈ కథ విన్న పరంధాయ్యగారు తుండుగుడ్డతో కళ్లద్దుకుంటూ 'బాబూ రవీంద్రా! నేను తెలియక ఏదో అన్నాను. నీ తండ్రిలాంటి వాడిని ఇవేమీ పట్టింకోకు సుమా' అన్నాడు. అదేంటి బాబాయి! మీరంటే నాకెంతో గౌరవం. మీరూ అమ్మగారూ ఈ పండగ సంబరం చూట్టానికి తప్పక రావాలి. బలి చూడొద్దులెండి. అది ఎలాగూ అవుతాం అన్నాడు. కానీ పరంధామయ్యగారు వస్తానంటూ గట్టిగా చెప్పలేకపోయారు.

ఎంతో ఉత్సాహంతో ఇంటికివెళ్లి తడక తలుపు తోసుకుంటూ ఇంట్లో కాలు పెట్టగానే వో వింత దృశ్యం చూస్తూ తన కళ్లను తానే నమ్మలేక తుండుగుడ్డతో అద్దాలు తుడ్చుకుని సరిగ్గా కళ్లకు సవరించుకుంటూ పాటించి చూచాడు పరంధామయ్య.

అవును ఆ పిల్ల రవీంద్ర భార్య సుక్రీయే సందేహంలేదు. మరి! మా బ్రాహ్మణికి తెలిస్తే ? అమ్మో ఇంకేమన్నా ఉందా? తను మంచి నీళ్లు తాగకపోవటం అలా వుంచి నాకు మజ్జిగనీళ్లన్నా దక్కనిస్తుందా? ఇక్కడి నుంచి తబాదిలా ఖాయం. ఏం జేస్తాను? అంతా ఆ దైవసంకల్పం' అనుకుంటూ నెమ్మదిగా గోనెపట్టా కుట్టిన వాలుకుర్చీ ఈడ్చుకుని చతికిలపడ్డాడు. అలికిడి విన్న పరంధామయ్యగారి భార్య చేటంత ముఖం చేసుకుని ముసిముసిగా నవ్వుతూ జారిపోతున్న వేలుముడి సవరించుకుంటూ 'మీరొచ్చారూ! ఎప్పుడొస్తారా? అంటూ ఎదురు చూస్తున్నాను. మీరంతా నాగరీకం బలిసి. 'దేవుడూ దేవుడు' అంటారే? ఆదేవుడు ఎక్కడున్నాడు? అనవసరమైన ఛాదస్తం అంటారు గదా. ఇప్పుడు చూడండి! ఈ పిల్లని! అంటూ ఉత్సాహంగా నా ముందుకొచ్చింది.

విషయం తెలిసి వాళ్ల ఆవిడ మాట్లాడుతుందో లేక ఆ అమ్మాయి నమ్రతా అదీ చూచి అగ్రవర్ణస్తురాలనుకుని మురిసిపోతోందో తెలియక సుళ్లు తిరుగుతూ ఉన్న మనస్సుతో 'ఏమిటీ విశేషం' అన్నాడు.

ఆ మాట విని ఇందాక ఎవడో సుంకరి వచ్చి 'సంకుదేవుడి' సంబరం చూడరమ్మంటూ పిలిచాడే, ఆ దేవుడు సామాన్యుడు కాడండి! సాక్షాత్తూ శంకరుడే. పశుపతీ పంచవక్త్రుడూ అయిన పరాత్పరుడండీ! కొలచిన వారికి కొలచినంత ఫలాన్ని ఇచ్చే దయామయుడండీ! ఏ పూజ చెల్లిస్తే ఏముంది? ఏది నైవేద్యం పెడితే ఏముందీ? భగవంతుడికి కావలసింది భక్తి! ఆ భక్తితో నిండుగా నమ్ముకున్న సుక్రిని ఈ సంకుదేముదు కాపాడుతాడండి. అది మనస్పూర్తిగా చిత్రణ్ణి ప్రేమించింది. వాడికే తన సర్వస్వాన్ని ముడుపుగా ఎత్తు కట్టింది. ఏదో విధి వక్రించి వాడు ఆపదల్లో చిక్కితే మరో మగవాడు ఈ పిల్లకి మొగుడయ్యాడు. కానీ అది పతివ్రతండీ. సీతమ్మలాంటి నిప్పుతునక, పైగా దేముణ్ణి గట్టిగా నమ్మి, కాపాడక ఎక్కడికి పోతాడన్న ధీమాతో ఉంది. అట్లే భగవంతుడూ పలికాడు. దాని శీలాన్ని కాపాడి దాన్ని చిత్రనితో కలిపాడు' అంటూ చెప్పుకపోతూ ఉంటే..

పరంధామయ్య ఆనందంతో తన కాళ్లు తాకిన 'సుక్రి'ని 'దీర్ఘసుమంగళీభవ' అంటూ దీవించాడు. ఆయన భార్య తాయారమ్మ దానికి పసుప్పు, కుంకుమా వో కొత్త రవికెగుడ్డా ఇస్తూ గుమ్మడిపండు లాంటి కొడుకును ఎత్తుకొమ్మంది.